# 20. సౌందర్యం

ఈ వూరు వొచ్చాక సుశీలకు బొత్తిగా తోచకుండా వుంది. భర్త ఉద్యోగ ధర్మమా అని ఆమె దేశం తిరగటమైతే అవుతోంది కాని, ఈ బదిలీలతో కొత్త వాతావరణంలో ఆమె మొదట్లో ఎంతో బాధపడాల్సి వొస్తోంది.

తను కాపరానికొచ్చిన ఐదు సంవత్సరాల్లోనూ ఇది నాలుగో పట్టణం. పట్టణ వాతావరణం ఎంతో కులాసాగా ఆనందంగా వుంటుందన్న మాటేగాని పక్కింటివారి గొడవన్నా లేకుండా ఎవరికి వారుగా జీవిస్తూండటమంటే ఆడవాళ్ళకు మరీ తలనొప్పిగా వుంటుంది. మరీ పిల్లా జెల్లా లేకుండటంతో ఆమెకు అసలే పొద్దుపోదు. పదింటికి ఆఫీసుకు వెళ్ళిన భర్త ఒకోనాడు క్లబ్‌లో తొమ్మిదింటిదాకా కూడా గడిపికాని ఇంటికి రాడు. గంటల తరబడిగా తనొక్కతే బిక్కుబిక్కుమంటూ నాలుగ్గోడల మధ్యా ఉండటమంటే ఎంత కష్టమో, హెూదాతో తన ఉద్యోగం చేసుకుంటూ సరదాగా కాలం గడిపేందుకు అలవడిన ప్రకాశరావు గ్రహించటం కష్టమే!

యీ విషయంలో తను చాలాసార్లు చెప్పి చూసింది.

"త్వరగా ఇంటికి రాకపోతే కుదరదు!" అని అలిగింది కూడాను.

"ఏం చెయ్యను? పదింటికి ఆఫీసు వొదిలాను. మిత్రుల బలవంతం మీద సినిమాకు వెళ్ళాను..." అనో లేక "పాత స్నేహితుడు కనిపిస్తే మాట్లాడుతూ కూర్చున్నాను. ఇంటి గొడవ నాకు పట్టలేదని కాదు. కాని విధిలేక ఆలస్యం చెయ్యాల్సి వొచ్చింది..." అనో సమాధానం వొచ్చేది.

యీ మొగాళ్ళు ఎంత తేలిగ్గా స్నేహితుల్ని సంపాయిస్తారు! గంటల తరబడి వాళ్ళతో హాయిగా కాలక్షేపం చేస్తారే కాని, తన స్నేహాన్నీ ప్రణయాన్నీ కోరే భార్యల సంగతే ఆలోచించరు. తను అలిగి కూడా లాభంలేదనే సంగతి చాలా కాలం కిందే తేలిపోయింది. ఔను...భర్త హొదాలో ఉద్యోగ ధర్మంలో లక్షాతొంభై పనులు చూసుకోవాలి. అందుకనే తానీ ఐశ్వర్యం, భోగం అనుభవించ గలుగుతోంది. ఇలా అని సరిపెట్టుకోవాల్సిందే కాని మరోమార్గం లేదని ఆమెకు తెలియకపోలేదు.

మరీ- ఈ పట్టణం ఆమెకు రోతగా వుంది. మొగాళ్ళంటే ఒకళ్ళనొకళ్ళు పరిచయం చేసుకోవటం వల్ల ఇట్టే స్నేహితులు దొరుకుతారు కాని ఆడవాళ్ళు- అందులోనూ పెద్ద ఉద్యోగి ఇల్లాలు. ఇరుగమ్మ పొరుగమ్మలతో స్నేహయాచనకై బయలుదేరేందుకు ఆమె గౌరవ మర్యాదలూ, అహంకారమూ అడ్డుపడినవి. ఏదైనా చదువుకుంటూ కాలం గడిపే పనీ? ఆ దాసీదాంతో బాతాఖానీ వెయ్యటం ఆమెకు అసలే ఇష్టం లేదు. దానికి తెలుగు బాగా రానూరాదు. ఈ పరిస్థితుల్లో ఆమె జీవితం యెంతో బరువుగానూ, విసుగ్గానూ ఉండసాగింది.

ఆమె విసుగు, కోపం ఎక్కువ కావటం ప్రకాశరావు గమనించకపోలేదు. అందుకు కారణం కూడా అతను గ్రహించకా పోలేదు. కాని తానేం చేస్తాడు?

“పోనీ మీవాళ్ళెవర్నన్నా పిలిపించుకో” అని సలహా యిచ్చాడు.

“ఇంత దూరం ఎవరొస్తారు? వొచ్చినా ఎన్నాళ్ళుంటారు? జీడల్లే పట్టుకొని వొదలకుంటే వాళ్ళను వొదిలించుకోవటం కూడా ఒక సమస్యే!” అందామె.

“ఇరుగు పొరుగుల ఇళ్ళకు వెళ్ళరాదా?” అన్నాడు ప్రకాశరావు.

“బాగుంది. వీళ్ళ భాష నాకు రాదు. నా భాష వాళ్ళకు తెలియదు. సౌజ్ఞల ద్వారా మాట్లాడుకోవాలి. వెధవ మొహాలూ, వెధవ వూరూను. ఆ దాసీదాంతో వేగేప్పటికే ప్రాణాంతకంగా వుంది” అందామె.

ఇది ప్రస్తుతానికి తేలే సమస్య కాదని ప్రకాశరావు విషయాన్ని మార్చుకున్నాడు.

❋ ❋ ❋

రోజు రోజుకూ ఆమె విసుగు ఎక్కువ కావటాన్ని గమనించి ప్రకాశరావు తన వుద్యోగాన్ని తనలో తాను తిట్టుకున్నాడు. ఏ విధంగానన్నా భార్యకు కాలక్షేపమయే మార్గాన్ని అన్వేషించటంలో అతను అశ్రద్ధ చూపలేదు.

పదోనాడు కాబోలు దాసుతో పరిచయం కలిగింది. దాసు మంచి మాటకారి కావటం వల్ల ప్రకాశరావును ఇట్టే ఆకర్షించాడు. అందులోనూ దాసు తెలుగు రచయితల్లో ఒకడు కావటం వల్ల సాహిత్యాభిలాష వున్న ప్రకాశరావుకు అతనంటే కొద్దిగంటల్లోనే

ఎంతో అభిమానం ఏర్పడింది. ఆ రాత్రే బలవంతపెట్టి దాసును తనింటికి భోజనానికి తీసుకొని వెళ్లాడు.

దాసును భార్యకు పరిచయం చేశాడు. సుశీలకు మొగజాతంటే ఒక దురభిప్రాయం మొదటినుంచీ వుంది. అందమైన ఆడదాన్ని చూస్తే మొగాడు చలిస్తే చలించుగాక– ఎందుకంటే – అంతవరకూ ఆ ఆకర్షణ ప్రకృతి సహజమైనదిగానే ఆమె ఒప్పుకుంటుంది. కాని అటుపైన నడిచే స్నేహంలో మొగాడు తప్పకుండా ఒక కల్మషాభిప్రాయాన్ని పెంచుకు తీరుతాడు. దీన్నామె ప్రకృతిసహజంగా ఎన్నడూ గుర్తించలేదు. ఎందుకంటే ఆడదాని పట్ల మొగాడు పెంచుకునే ఆ కోర్కె వల్ల తాను బాధపడేది; తానేమిటి గౌరవ మర్యాదల్ని పాటించే ఏ స్త్రీ ఐనా దాన్ని సహించలేదు.

యీ అభిప్రాయానికి రావటానికి అనేక కారణాలున్నవి. సుశీల చదువుతూన్న నాటినుంచీ యీనాటివరకూ కనీసం ఒక యాభై సంఘటనలు ఇలాటివి చూపగలదు. స్నేహం వంకతో తనతో చదువుకునేందుకని వొచ్చే నారాయణరావు ఒకనాడు హఠాత్తుగా తన చెయ్యి పట్టుకోవటం, రెండో చేత్తో తను అతని దవడ వాయగొట్టటం, అంతలో ఆమె మీది ప్రేమకు నీళ్ళధార వొదిలి అతను ఆ వీధినే నడవకపోవటం మొదటి సంఘటన. ఆ తరువాత ఎదురింటి ప్లీడరు – ముగ్గురు పిల్లల తండ్రి తన కన్యాత్వాన్ని బలిగొనేందుకు ఎన్నో ఎత్తులు వేయటం నుంచీ – తనను చూసి పిచ్చి వాళ్ళమయ్యామనే ధోరణిలో ఉత్తరాలు రాసిన యువకుల నుంచీ, ఏదో సాహసం చేస్తే లొంగుతుంది కదాననే భ్రమతో గోడలు దూకిన నవయువకుల వరకూ సింహావలోకనం చేస్తే – మొగజాతే ఇంతనే అభిప్రాయం ఆమెలో పాతుకుపొయ్యేందుకు కారణభూతమైంది. యీ విధంగా మొగాడితో పరిచయం జరిగినప్పుడు – ఆమె చదువుసంధ్యలూ సంస్కారమూ లెక్కలోకి రావు; అదేవిధంగా ఎదుటి వ్యక్తిలోని సంస్కారాన్ని ఆమె లెక్కచెయ్యదు; కేవలం తన పూర్వానుభవం మీద ఆమె ఆ పురుషుణ్ని ఒకపక్క ఏవగించుకుంటూనే రెండో వైపు వొదిలించుకునేందుకు ప్రయత్నం చేస్తుంది.

దాసు విషయంలో ఆమె ఇందుకు భిన్నంగా ప్రవర్తించలేదు. పరిచయ మౌతూన్నప్పుడే తన అందాన్నీ, యవ్వన శోభనూ మింగేసేటట్టుగా చూసిన అతని తీక్షణ వీక్షణాన్ని ఆమె గమనించింది. అప్పుడే 'ఇంకో మృగం నాకు దాపరించింది' అనుకుందామె.

కాని ఆమె అలాంటి భావాల్ని వ్యక్తీకరించలేదు. ఇందుకు ఆమె సభ్యత అడ్డుపడింది. అందుకని ఆమె నవ్వుతూ దాసుకు నమస్కరించింది.

ఆ తరువాత భోజనాలయినయ్. రాత్రి చాలా పొద్దుపొయ్యేవరకూ పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. మాటల ధోరణిని బట్టి దాసు తాను అనుకున్నంత అనాగరికుడు కాదనీ, సంస్కారమున్న వ్యక్తేననీ సుశీల గ్రహించింది. ఐనప్పటికీ మొగాళ్ళతో ఎంతో జాగర్తగా ఉండాలని ఆమె నేర్చుకున్న గుణపాఠం తనకు రక్షగా ఉండనే వుంది.

"ఇక్కడ తెలుగువాళ్ళు తక్కువ. సుశీలకు బొత్తిగా తోచకుండా వుంది. ఆమెకు పరిచయమైన మొదటి వ్యక్తులు మీరు. సాహిత్యంలో ఇద్దరికీ ఇంటరెస్ట్ వుంది కనుక మీకు తీరిగ్గా వున్నప్పుడు ఆమెకు కాలక్షేపమయేట్టు చూడండి" అన్నాడు ప్రకాశరావు.

ఒక క్షణం జవాబివ్వ లేకపొయ్యాడు దాసు.

"సరేలెండి. మా ఇల్లు ఈ పక్క వీధిలోనే" అన్నాడు దాసు.

భర్త చెప్పిన పద్ధతి సుశీలకు బొత్తిగా రుచించలేదు. దాదాపు పగలంతా భర్త ఆఫీసులోనే గడుపుతాడు. ఈ అవకాశాన్ని కల్పించటం వల్ల దాసు తనింటికి రాకపోకలు సాగించటం, స్నేహం పెంచుకునేందుకు ప్రయత్నించటం జరుగుతుంది. ఆ తరువాత ఏమౌతుందో తనకు తెలుసు. తన చేతుల్లో శృంగభంగమైన మొగాళ్ళ సంఖ్య మరొకటి పెరుగుతుంది. ఇంత బాధా, గందరగోళం అనవసరం. ప్రమాదం వచ్చాక దాన్నుంచి తప్పించుకునే శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికీ, ప్రమాదాన్ని కోరుకోవటం మౌఢ్యం; అది దాపురించకుండా చూసుకోవటం ఉత్తమం.

తన భర్త కానీ, ఇతరులు కానీ తనను శంకిస్థారనే భయం ఆమెకు లేదు. అదీగాక భర్తే యీ పరిచయాన్ని చేయటం జరిగింది; తానులేని సమయాల్లో తనింటికి నిర్భయంగా రావొచ్చని కూడా ఆయనే అన్నాడు. తనకసలు కల్మషాత్మ బాధలేదు కనుక ఒకరి భయమనే ప్రస్తావనే లేదు. ఐనా కూడా యీ పద్ధతికి ఆమె అంగీకరించలేదు; కాని ఆ సంగతి బాహాటంగా చెప్పనూలేదు. ఒక విధంగా అది తన భర్తను పరపురుషుని ఎదుట చిన్నబుచ్చటమవుతుంది. తానేమో భయపడ్డట్టు కూడా రుజూ చేసుకోవటమవుతుంది. సభ్యతనూ, నాగరికతనూ కాపాడుకొనేందుకని ఆమె మౌనంగా వుండిపోయింది.

"ఇంక వొస్తానండీ... రాత్రి చాలా పొద్దెక్కింది" అని లేచాడు దాసు.

దంపతులిద్దరూ అతన్ని సాగనంపేందుకు లేచి నిలబడ్డారు. దాసు వారిద్దరికీ నమస్కరించి చకచకా వెళ్ళిపోయాడు.

ప్రకాశరావు నవ్వుతూ "మంచివాడు. సరదా మనిషి!" అన్నాడు.

"ఎందుకూ మీరు లేనప్పుడు మనింటికి రమ్మనటం?" అందామె.

"ఏదో నీకు యీ రకంగానన్నా కాలక్షేప మౌతుంది."

ఇక యీ విషయంమీద వాదనవేసుకునే ఓపిక ఆమెకు లేదు. అందుకని ఆమె పడకగదికి దారితీసింది.

* * *

ఆ మర్నాడు పగలంతా ఆమె ప్రతి క్షణంలోనూ దాసు వొస్తాడనే ఎదురు చూడసాగింది. అతను వొస్తే త్వరగా బైటికి పంపేసే విధానాన్ని రకరకాలుగానూ ఆలోచించసాగింది. ఏ కాస్త చప్పుడైనా అతను వొస్తున్నాడనే అనుకోవటం, ఏ వ్యక్తీ కనపడక పోవటంతో విసుక్కోవటం, మధ్య మధ్య ఒకవేళ వొస్తున్నాడేమోనని వీధిలోకి వెళ్ళి నిలబడటం, దారినపొయ్యే మొగాళ్ళు తనను తేరిపార చూడటం, తాను గమనించినా గమనించనట్లు అసలు పురుషులే ఆ వీధిన లేనట్లుగా నటించటం అనేకసార్లు జరిగింది...కాని ఆ రోజుకు దాసు రానేలేదు.

తనంత అందెగత్తెతో పరిచయం కావటంతోనే కనీసం తనను చూసి ఆనందించేందుకైనా వచ్చిన అవకాశాన్ని కూడా వృధాపుచ్చని పురుషుడంటూ లేడని ఆమె నమ్మకం. అందుకనే దాసు తప్పక వొస్తాడని ఆమె నమ్మింది. ఆ మర్నాడు కాదుకదా- వారం రోజుల వరకూ అతను కనిపించనేలేదు.

భర్త రోజూ అడుగుతూనే వున్నాడు.

"రాలేదు" అని ఆమె నిరుత్సాహంగా జవాబు చెపుతూనే వుంది. దాసు రాకపోవటంలో ఆమె తనకేదో అవమానం జరిగినట్లు, తన అందచందాలు అతన్ని ఆకర్షించలేక వ్యర్థమవటంవల్ల స్వాభిమానానికి దెబ్బతగిలినట్లు అన్నిటినీ మించి యీ పరమ రహస్యాన్ని భర్త గ్రహించి, ఎగతాళిగా చిన్న నవ్వు నవ్వినట్లు ఆమె భావించుకొని బాధపడసాగింది. దాసు వొస్తే అతన్ని వొదిలించుకునేందుకు మారుగా సాధ్యమైనంతసేపు తన సమక్షంలో ఉంచుకోవటం ద్వారా తిరిగి తన సౌందర్యపు విలువను రుజూ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

కాని అతను వొస్తేకద? రోజు రోజుకూ ఆమె యీ ఆశ క్షీణించసాగింది. చివరకు అసలతను రాడనేవరకూ నిశ్చయించుకుంది. అతను రాకపోవట మంటే తన సుందరమూర్తిని లెక్కచెయ్యక పోవటమనే భావన ఆమెలో లోతుగా పాతుకుపోయింది. పూర్వం ఆమెకు కాలం గడవక బాధపడేది. దీనికితోడు యీ అవమానంతో ఆమె మరింత బాధపడసాగింది...దాసే కనుక యీ ఇంటికి రావాలీ- ఒక విధంగా అతన్ని రెచ్చగొట్టయినాసరే తనవెంట కుక్కల్లే తిరిగే పర్యంతం చేసి, చివరకు అవమానించి తన కసి తీర్చుకోవాలి! పక్క వీధినే తన ఇల్లని చెప్పి కూడా దాసు రాకపోవటమంటే కనీసం తాను రాలేని కారణాన్ని తెలియపరచకుండా వుండటమంటే తన సౌందర్యానికి విలువనివ్వకపోవటమేనని తెలుసుకో లేకపోలేదు తెలివైన సుశీల!

ఒకనాటి రాత్రి ప్రకాశరావు అన్నాడు. "దాసు రేపు తప్పకుండా మనింటికి వొస్తాడు."

"మీకెలా తెలుసు?" అందామె అమాయకంగా.

"యీ మధ్య వూళ్ళో లేడట. ఇవాళ సాయింత్రం వొచ్చాడట. రేపు సాయింత్రం మూడింటికి వొస్తాడు. నేను ఆఫీసునుంచి వొచ్చేదాకా ఇక్కడే ఉండమను. అందరం కలిసి సినిమాకు వెళ్దాం" అన్నాడు భర్త.

అదా సంగతి! వూళ్ళో లేకపోవటం వల్ల దాసు రాలేదు. కాని తనను లెక్కచెయ్యకపోవటంవల్ల కాదని తెలిపోవటంతో ఆమె మనస్సు కాస్త తేలికపడింది. ఇక రేపు తన దర్శనం కోసం వొస్తాడు కనుక అనేకమంది పురుషుల్ని ఆకర్షించి బాధించగలిగిన తన శక్తిసామర్థ్యాల్ని వేరొకసారి తనకు తానుగానైనా పరీక్షించుకోవటంతో కాని తనకు శాంతి లభించదు!

❋ ❋ ❋

దాసుతో మాట్లాడాల్సిన విధానం దగ్గర్నుంచీ, అతని వైపు చూడవలసిన చూపువరకూ ఆమె ఆలోచించుకుంది. తోచని తనకు చిన్న పిల్లాడికి దొరికిన ఆటవస్తువులాగు యీ దాసు దొరకటంతో తన వినోదమంతా ఇతని పట్లనే ప్రయోగించాలని ఆమె వేచి కూర్చుంది. రెండింటికే బాగా ముస్తాబైంది. ఐతే ఇదంతా అతనికోసమేననుకోవటాన్ని ఆమె అంగీకరించదు. ఎందుకంటే ఆమె పేరు మాత్రమే సుశీల కాదు. భారత నారీమణుల పతివ్రతా రక్తం ఆమె శరీరంలో వేగంగా ప్రవహిస్తూనే వుంది. యీ సంగతి ఆమెకే కాదు- ఆమెను ఎరిగినవాళ్ళందరికీ తెలుసు. ఐతే యీ ముస్తాబు ఎందుకనే ప్రశ్న ఉండనే వుంది- కేవలం దాసును ఆకర్షించి అతన్ని ఒక హద్దులో కట్టిపడేసి తాను వినోదంగా కాలం గడిపేందుకు మాత్రమే!

మూడు దాటినప్పటి నుంచీ ఆమె ఆతృత మరీ హెచ్చింది. ఐనా యీ పురుషుడి కోసమై తాను మధనపడటం ఎంత హాస్యాస్పదమో ననిపించింది. కాని తానేమీ మధనపడటంలేదు. అతను మధనపడేట్టు చేయటమే తన ఆశయం! ఏమైనా వ్యధను మరిచిపోదామనుకుంది. ఎలాగైనా మనస్సును ఆ విషయం మీద లగ్నంకాకుండా చేసుకోవాలనుకుంది. అతను వొస్తే ఎంత - రాకుంటే ఎంత! అందువల్ల తన సుఖం గొప్పతనం తగ్గేదేమిటి? లెక్కచెయ్యకుండా వూరుకోవటం ఎంతైనా ఎన్నుకోదగ్గది. కాని వొస్తానన్న వాణ్ని వొచ్చేపక్షంలో లెక్కచెయ్యకుండా ఉండటం ఎలా? ప్రస్తుతానికి యీ ఆలోచనల్లోంచి బైటపడేందుకని ఆమె పాట ప్రారంభించింది.

పాడుతున్నదన్నమాటే కాని ఏ క్షణాన అతడు వొస్తాడోననే ఆతృత లోపల పనిచేస్తూ వుంది. ఒకవేళ వొచ్చినా తనేదో తన పనిలో వున్నట్లు నటించటం చాలా మంచిది. అందుకని ఈ పాట తనను, తన గౌరవ మర్యాదల్నీ కాపాడేందుక్కూడా ఉపకరిస్తుంది.

వెనుదిరిగి చూసి ఆమె ఉలిక్కిపడింది. తనలో తాను ఆలోచించుకుంటూ పాడుకుంటున్నదన్నమాటేకాని తన చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఆమె

గమనించటంలేదు. అందుకనే దాసు వొచ్చి నిలబడినప్పటికీ ఆమె గ్రహించ లేకపోయింది. తాను నటిద్దామనుకొన్న దృశ్యంలో - నటనకు మారుగా సభ్యత హద్దుల్ని తనకు తెలియకుండానే దాటటం జరిగింది. అదీగాక తన పాటను దాసుకు వినిపిద్దామనే కుతూహలం ఆమెకు లేదు. అలాటిది ఎంతసేపట్నుంచీ అతను వింటున్నాడోననే బాధకూడా ఆమెకు కలిగింది. తన పాట తన అందచందాలంత ప్రసిద్ధం కాకపోవటంవల్ల ఆమె సిగ్గుపడవలసి వొచ్చింది కూడాను.

సిగ్గుతో, తత్తరబాటుతో ఆమె లేచి నిలబడింది. జారిపొయ్యే పమిటను పైకి లాక్కుంటూ "క్షమించాలి....మిమ్ము చూడలేదు" అంది.

"మీ పాటకు భంగం కలిగించాను" అన్నాడు దాసు.

"ఏం పాటలెండి...ఏదో కూనిరాగం" అందామె.

"మీ కలాగే వుంటుంది. మీకు సాహిత్యంలోనే గాక సంగీతంలో కూడా ప్రావీణ్యతా, ఉత్సాహమూ ఉండటం హర్షించతగ్గ విషయం"

ఈ మెప్పుకు ఆమె లోలోన సంతోషపడింది. ఒకవేళ తనకు తెలియకుండానే తాను గుర్తించకుండానే తనకున్న కొద్దిపాటి సంగీత విజ్ఞానము ఇతరులకు వినసొంపుగా తయారైందేమోననే అనుమానం ఆమెకు కలిగింది. ఆ పాటను దాసు భరించలేని పక్షంలో తన ఉనికిని ఏదో విధంగా తెలియపరుచునేవాడే కదా! అందులోనూ తను దాసును ఆకర్షించి ఏడిపించాలనే నిశ్చయం ఆమెకు జ్ఞాపకమొచ్చింది. తన ప్రయత్నం లేకుండానే దాసు ఆకర్షించబడుతున్నాడనేందుకు సందేహం లేదు. ఇది తాను గమ్యస్థానాన్ని జేరేందుకు మరింతగా తోడ్పడుతుంది.

"నాకు మతిపోయింది.... మిమ్ము కూర్చోమనటం కూడా మరిచి పొయ్యాను" అందామె, తేరుకొని.

దాసు కూర్చున్నాడు.

"ఉండండి, కాఫీ తెస్తాను" అని ఆమె లోనికి వెళ్ళింది. దాసు వొద్దని అందామనుకున్నాడు కాని ఆమె వినే స్థితిలో లేకుండటం వల్ల వూరుకోవాల్సి వొచ్చింది.

కాఫీతో పాటు ఫలహారాలు కూడా వొచ్చినవి.

"ఇన్ని తినలేను...కాఫీ తాగుతాను" అన్నాడు దాసు.

"నాకు ఆకలవుతోంది. మీరు తినకుంటే నేనూ మానుకోవలసి వస్తుంది" అందామె.

దాసు తెల్లబొయ్యాడు. ఆమె చూపే చనువుకు అతను తనను తాను మరిచిపోయినట్టవటమే కాదు, ఆ సంగతిని సుశీల గ్రహించ గలిగేవరకూ వెళ్ళాడనటంలో పొరపాటు లేదు.

"ఈ వూళ్ళో నాకు బొత్తిగా తోచకుండా వుంది. మీరన్నా వొస్తారేమో కాలక్షేపమవుతుందనుకుంటే - యీ నాటికిగాని మీరు రాలేదు."

"ఊళ్ళో లేను--" అన్నాడు దాసు.

"అదే విన్నాను. మీ ఆడవాళ్ళను కూడా తీసుకొనిరాకపొయ్యారా?" అందామె.

"పుట్టింటికి వెళ్లారు--కాన్పుకు."

ఆమె నవ్వింది. ఆ బాధ తనకింతవరకూ కలగనందుకు గర్వపడింది కూడాను.

"వారొచ్చేదాకా ఉండమన్నారు. ఇవాళ సినిమాకు వెళ్దామన్నారు."

"మీరు వెళ్ళిరండి" అన్నాడు దాసు.

"ఏం మీరు రాకూడదా? మా కంపెనీ మీకు గిట్టనట్టుంది" అందామె.

"ఎంత మాట! మీలో మీరు వూహించుకోకండి. మీ కంపెనీ గిట్టక పోవటమేమిటి? మీరు విసుక్కోకుండా వుంటే ఎప్పటికీ ఇక్కడే వుండిపోదామా అనుకుంటున్నానంటే మీరు నమ్మరేమో?"

"అంత విశేషమేమున్నదనీ?"

"ఏమో నాకెలా తెలుస్తుంది? ఆంధ్రులంటే అభిమానం మాత్రమే కాదనుకోండి, విద్యా సంస్కారాలున్న వ్యక్తుల్తో, అందులోనూ మీలాటి అందగత్తెతో మాట్లాడటంలో ఎంత హాయి వుంది!"

'అందగత్తె' అన్నప్పుడు సూచనగా తన కళ్ళల్లోకి చూశాడు. ఆ పదప్రయోగంలో దురుద్దేశం వున్నదనేందుకు తగిన కారణాలు లేవు. అదీగాక తన అందచందాల్ని దాసు గుర్తించాడనేందుకు ఇంతకన్న తార్కాణం అక్కర్లేదు. ఆమె ఎంతో తృప్తిపడింది.

అందగత్తె తన విలువను గ్రహించటం ఒక్క సుశీల విషయంలోనే గాక, అలాటి ప్రతి స్త్రీ విషయంలోనూ ఒకేవిధంగా వుంటుంది. మొదట్లో తనకంత విలువ వున్నదనే సంగతి ఏ అందగత్తెకూ తెలియదు. పురుషులు చూసే ఆశాభరితమైన తీక్షణ వీక్షణాల దగ్గర్నుంచీ, వారు తనకోసం చేసే ప్రయత్నాల వరకూ, విజ్ఞులైనవారు కూడా మూఢులవలె ప్రవర్తించటం మొదలూ, ప్రాణమానాలకు లెక్కచెయ్యకుండా చూపే ధైర్యసాహసాల వరకూ ఒక్కసారి సింహావలోకనం చేసుకొని అందగత్తె తన విలువను తాను గుర్తించకలుగుతుంది. అందగత్తెల్లో కూడా భేదాలున్నవి. ఉదాహరణకు- అందగత్తెలు కూడా పురుషుల్ని ఆకర్షించలేకుండటం వల్ల ఆమె అందాన్ని లోకమూ గుర్తించదు; ఆమె గ్రహించలేదు. ఇక రెండోరకం- తన అందాన్ని గుర్తించిన పురుషుల వల్ల తన విలువను తాను తెలుసుకోవటం. తన విలువ తగ్గకుండా పురుషుల్ని ఆకర్షించటం ద్వారా విలువ పెంచుకొని, తనలో తాను తృప్తిపడతారు. సుశీల యీ రెండోరకం అందగత్తనేందుకు సందేహంలేదు.

అందుకనే ఆమెకు ఎప్పుడూ తన అందాన్ని గూర్చి పొగడ్త అత్యవసరంగా కనిపిస్తుంది. భర్త తనను మెచ్చుకోడనీ కాదు; తనను తగినంతగా ప్రేమించి సుఖపెట్టటంలేదని కాదు కాని రాజుగారికి 'వందిమాగధుల' వల్ల కొత్తగా వొచ్చిపడే విలువలాటిదే, తనకు హెచ్చరికలు చెపుతూ తన సౌందర్యాన్ని మెచ్చుకునే పురుషుల వల్ల ఆ ఘనతను ఫీలయితేనే కాని ఆమెకా తృప్తి కలగదు. గుర్తించబడని సౌందర్యం అడవిగాచిన వెన్నెలే కదా! అందుకని తన సౌందర్యాన్ని గుర్తించబడేట్లుగా చేయటంలో ఆమె ఎన్నడూ అశ్రద్ధ చేయలేదు. అంతవరకీ – సౌందర్య పిపాస ఏ విధంగానూ నేరం కాదు. పైపెచ్చు సౌందర్యారాధన కళగా కూడా గుర్తించబడుతూనే వుంది. ఇందువల్ల అటు సౌందర్యానికి యాజమాన్యం వహించినవారికి కానీ ఇటు సౌందర్యారాధకులకు కానీ ఎలాటి ఇబ్బందీ లేదు సరికదా ఉభయులకూ ఆధ్యాత్మికమైన ఆనందం లభిస్తుంది. ఇలాటిది ఆమె కోరి తెచ్చుకోవటమూ లేదు. అతి సామాన్య సంఘటనగా జరుగుతూనే వుంది. దాంపత్య ధర్మాన్ని అతిక్రమించటంలాటిదేమీ లేదు. కేవలం ఆత్మ తృప్తి కొరకు జరిగే కళారాధనే కనుక సుశీల తత్వాన్ని మనం ఏ విధంగానూ అపార్థం చేసుకోలేము; ఆ సంగతి సుశీలక్కూడా తెలుసు!

"నాదేం అందంలెండి!" అందామె దాసును రెచ్చగొట్టి మరింతగా పొగిడించుకోవాలని.

"అమ్మమ్మ... అలా అంటారేమండీ! నిజంగా మీ భర్త చాలా అదృష్ట వంతులు" అన్నాడు దాసు. తన దురదృష్టాన్ని గూర్చి వేరే చెప్పాల్సిన అవసరం లేకుండానే సాగించాడు: "బహుశా మీకు తెలిసి వుండదనుకుంటాను. మొదటిసారి మన పరిచయంలో నేను దిమ్మెరపోయానంటే మీరు నమ్మరు."

దాసును అర్థంచేసుకోవటంలో ఆమె పొరబడలేదు. ఇది వరకు తాను ఎరిగిన మూర్ఖుల్లోనే ఇతనూ జమ. మూర్ఖుడనే ఉద్దేశంతో ఆమె అతన్ని వొదిలించుకోదలచలేదు. ఎందుకంటే ఒక వ్యక్తి గొప్పతనానికి మిగతా వ్యక్తుల తక్కువతనమే కారణమనే సత్యం ఆమెకు తెలుసు. అదీగాక అతని మూర్ఖత్వాన్ని తుదివరకూ పోనిచ్చి అతన్ని పరాభవించి సాగనంపందే తనకూ తృప్తి కలగదు. అప్పటిక్కాని సౌందర్యారాధనంటే ఏమిటో ఎదుటి వ్యక్తికి సరిగ్గా తెలియదు. తన సౌశీల్యము తనకు తనే రుజూచేసుకొని గర్వించే అవకాశమూ కలగదు. అప్పుడే తనకెంతో తృప్తి కలుగుతుంది.

కనుకనే దాసు ధోరణిని ఆమె అరికట్టలేదు. అతను చేసే స్తోత్ర పాఠాలను వింటూ మధ్య మధ్య సిగ్గును నటిస్తూ ఒకోచోట ఆఁ. అలాగా!' అన్నట్లు అతని వైపే చూస్తూ కూర్చుంది. తన పొగడ్తలు అంగీకరించబడటంతో దాసు కాస్త హద్దులు మీరి కవిత్వధోరణిలో పడ్డాడు. దాసు పిచ్చివాగుడు ప్రారంభించటం ఆమెకు మరింత వాటంగా తోచింది. తాను అనుకున్నంత గంభీరత దాసులో లేదు. మిగతా మొగాళ్ళలాగే

కొద్దిసేపట్లో జావయి పొయ్యాడు! ఇతన్ని బోల్తా కొట్టించటం ఇంత తేలికని ఆమె అనుకోలేదు. ఏదో నిర్లక్ష్యత చూపాడని పొరబడింది కనుక దాసుకు నషాళం అంటేంత వరకూ యీ కార్యం జరగవలసిన అవసరం ఏర్పడింది.

ప్రకాశరావు త్వరగానే రావటం వల్ల సుశీలకు కొంత తేలికనిపించింది; ఎందుకంటే దాసు తన మెప్పుకోళ్ళన్నిటిని యీ ఒక రోజులోనే పూర్తి చేస్తాడేమోననే భయం ఆమెను బాధించింది; అదీగాక తాను మాట్లాడే అవకాశం లేకుండా అమ్మవారల్లే కూర్చోవటం కూడా ఆమెకు ఇబ్బందిగానే వుంది. పోనీ ప్రస్తావన మారుద్దామా అంటే అది తనకు రుచించలేదు. యీ విషమావస్థలో ప్రకాశరావు దేవుడల్లే వూడిపడ్డాడు.

సుశీల ముఖం కళకళ్ళాడుతూండటంతో ప్రకాశరావు యీ పరిసరాల్ని భార్యకు ఆనందంగా చేయగలిగాననే తృప్తి కలిగింది. ఇక ఆమె విసుగ్గా కోపంగా ఉండదు, తన మీద రుసరుసలాడదు. అంతకన్న తాను కోరేది కూడా లేదు.

ముగ్గురూ కలిసి సినిమాకు వెళ్ళారు. యెన్నెన్నో విషయాల్ని మాట్లాడుకున్నారు. చిరకాల స్నేహితుల వలె ఒకరిపట్ల వేరొకరు యెంతో చనువుగా ప్రవర్తించారు. ఆ వ్యక్తులు ముగ్గురూ కూడా ఎంతో ఆనందించారు.

మర్నాడు తప్పకుండా వస్తాననేదాకా ప్రకాశరావు దాసును వొదల్లేదు. 'ఆయన పిచ్చిగాని దాసు రాక ఎక్కడికి పోతాడు' అనుకుంది సుశీల.

❋ ❋ ❋

తీపికూడా తినసాగాక మొహం మొత్తుతుంది. అలాగే దాసు చేసే స్తోత్రపాఠాలే మొదట్లో ఎంతో మాధుర్యంగా ఉన్నప్పటికీ మార్పు లేకుండా రోజూ అదే కంఠస్వరం, అదే భాష, అదే ధోరణి – మార్పేమీ లేకుండా ఉండటంతో ఆమెకు వెగటనిపించింది. ఇంతకు మినహాగా కాలక్షేపమయ్యే మార్గం లేకుండటం మరీ తలనొప్పిగా వుంది. అది కారణంగా ఒక నెలరోజులు దాసును భరించగలిగిందేమో కాని, ఇక ముందు లాభంలేదు.

ప్రతి రోజూ అతను మూడింటికల్లా రావటం, ప్రకాశరావు వొచ్చేదాకా ఉండటం, ఆ తరువాత ఒక గంటసేపు బీచిలోనో లేక ఇంటిని ఆనుకొని వున్న తోటలోనో గడపటం పరిపాటయింది. మూడింటికి దాసు వొస్తాడు కనుక రెండింటికే ముస్తాబు కావటం ఆమెకు తప్పనిసరయేది. 'రేపైనా దాసు తన ధోరణిని మారుస్తే బాగుండును' అనుకునేది; కాని ఆ మర్నాడు మధ్యాహ్నానికల్లా ఒకవేళ దాసు రాడేమోననే బాధ, మరో వైపు నిజంగానే తనను మెచ్చుకోడేమోనని వ్యథ, తాను ఆకర్షించటంలో లోపం జరగకుండా వుండటానికై ప్రయత్నలోపం జరక్కుండా చూసే బాధ్యతలను ఆమె తప్పించుకోలేని స్థితికి వొచ్చింది.

యీ సంఘటనలు ఇంకా ఎంతదూరం సాగేట్టు? వీటిని అంతమొందించుకోవాలనే నిశ్చయం ఆమెలో కలిగింది. అందుకు ఒక్కటే మార్గం. అతన్ని ఇంకా ఆకర్షించటం, ఎంతో చనువును ప్రదర్శించటం, అతను సాహసిస్తే బైటికి నెట్టటమూను! ఆమెపట్ల ఇవి సామాన్య సంఘటనలు. ఇందుకై ఆమె శతవిధాల ప్రయత్నించింది. దాసు పట్ల ఎంతో అభిమానాన్ని నటించింది. అతన్ని రెచ్చగొట్టేందుకు తనకు తెలిసిన టక్కులన్నిటినీ ప్రదర్శించింది.

కాని అదేం చిత్రమో కాని, దాసులో చలనం ఉండదు. ఆమె చూపే చనువంతా కేవలం స్నేహసంబంధమైనదే కాని కామసంబంధమైనదనే అభిప్రాయం అతనిలో కలగటం లేదు. ఒకవేళ దాసు కేవలం సౌందర్య పిపాసి మాత్రమేనేమోననే అనుమానం ఆమెలో కలిగింది కాని, పురుషుల పట్ల తాను అనుభవపూర్వకంగా ఏర్పరుచుకున్న అభిప్రాయాన్ని మార్చుకోలేక పోయింది.

తాను ఏ మాత్రం ఆశఉన్నా ఇట్టే అర్థమయేట్లు ప్రవర్తించటాన్ని అతనెందుకు గ్రహించడు? ఒకవేళ గ్రహించి కూడా తనకు పట్టనట్టే వూరుకుంటున్నాడా? లేక ఇంతకు పూర్వం ఎక్కడైనా తనలాటి సాధ్వి తగిన విధంగా బుద్ధి చెప్పిందా? తానింకా బైట పడటంవల్ల తనను తాను అల్పం చేసుకోవటమౌతుంది కనుక అది లాభం లేదు. మరి ఈ మోతాదు చాలకపోతే ఎలాగు? దాసు రసికుడని తను మొదట్లో ఏర్పరుచుకున్న అభిప్రాయంలో పొరపాటేమైనా వుందేమో? దాసు ఆమెకు కొరుకుడుపడని కొయ్యగా మారి కూర్చున్నాడు.

❋ ❋ ❋

హఠాత్తుగా ఆమెకు ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయింది. దాసు దాసీదాని చేత తనకు ప్రణయ లేఖ పంపాడు! ఈ లేఖను లిఖించటం కోసమే కాబోలు రెండురోజుల్నుంచీ తనింటికి రాకుండా వుంది. ఇంతలో యీ పీడ విరగడైనదని సరిపెట్టుకుంటే ఇంతలోనే ఈ దారుణ సంఘటన వాటిల్లింది!

ఉత్తరాన్ని ఒకటికి రెండుసార్లు చదివింది. అంతా కవిత్వమయం! తను అతనిక్కావాలిట! తను లేందే బతకలేడట! లోకంలోని మొట్టమొదటి ప్రియుడు కూడా తన ప్రియురాలికి ఇవే మాటల్ని చెప్పి వుంటాడు. తన ప్రేమలో తలకిందులుగా పడ్డవాళ్ళంతా కూడా ఇవే భావాల్ని వ్యక్తపరిచే వాక్యాలతో తనకు ప్రణయలేఖలు రాశారు. ఒకప్పుడు దాసులో నిగ్రహ శక్తి వుందని తాను భ్రమించింది. కాని దాసేమిటి-దాసు తలకాయలో జేజెమ్మ కూడా తన అందచందాల ముందు మోకరిల్లవలసిందేననే సత్యం మరోసారి రుజూవైంది. ఇది తనకొక యోగ్యతాపత్రమే కాని--?

విద్యా సంస్కారాలు గల దాసు ఇంత నీచపద్ధతిలో తనను ప్రణయభిక్ష వేడుతాడని ఆమె యెప్పుడూ అనుకోలేదు. తానంత చనువు ఇచ్చినప్పుడు చలించకుండా ఊరుకున్నాడంటే బహుశా ధైర్యం అడుగంటి వుండాలి. తన సౌందర్యాన్ని ఎడ్మైర్ చేయటంలో అతనికి వేరే ఆలోచనలే కలగకుండా వుండి వుండాలి. అందుకనే ప్రాథమిక ప్రణయాన్వేషకులు - ఏ యవ్వన ప్రవేశంలోనూ కాగితం మీద తమ కోర్కెల్ని వెడలగ్రక్కుకోవటం, కళ్ళు మూసుకొని ఎలాగో దాన్ని ప్రియురాలికి అందించి ఆ ఫలితం కోసం ఆతృతగా వేచి కూర్చోవటం లాటి పద్ధతి తప్ప వేరొక మార్గమే దాసుకు తోచనందుకు ఆమెకు కొంత జాలి కలిగింది.

కాని తను ఏమనుకున్నాడు? ఇందుకు కాదూ తనకు యీ మొగపురుగులంటే ఇంత మంట! తనేం సంసారి కాదనుకున్నాడేమో? ఇక సందు చిక్కనే చిక్కింది. దాసుకు తగినవిధంగా బుద్ధి చెప్పి భారతదేశంలో ఆధునిక యుగంలో కూడా తనలాటి పతివ్రతలున్నారనే సత్యాన్ని ఎరుకపరచటం తన విధ్యుక్తధర్మం! బుద్ధిలేని యీ మొగాళ్లు ఇంత తేలిగ్గా అందగత్తెల వెంట ఎలా పడతారో! ఆ విజ్ఞానమంతా అజ్ఞానంగా మారి ఎంతెంత ఘనులు కూడా అల్పులవుతారో తనకు తెలియంది కాదు. అందుకనే దాసు విషయంలో కూడా తాను విజయాన్ని సాధించిన గర్వాన్ని పొందగలిగింది.

దాసుకు తాను వేరొక విధమైన శిక్షను - కాస్త కఠినశిక్షనే విధించాలి. ఇందుకు భర్త సహాయం అవసరం. అప్పుడు భర్తకు తన సౌశీల్యంతో పాటు ఇక ముందు యీ మొగపురుగుల్ని తనకు పరిచయం చేయకూడని బాధ్యత కూడా తెలిసి వొస్తుంది. ఇలాటి సంఘటనలు పూర్వం జరిగినప్పుడు తాను భర్తకు తెలియపరిచింది.

అతనిదొక వింత తత్వం కావటం వల్ల "నవ్వి అంతేలే! అందచందాలు ఆకర్షిస్తవి. దానికి ఆ పురుషులు కూడా మూర్ఛపడ్డారు. పోనీలే - దానికి, నీ బాధ్యతా లేదు, వాళ్ళ బాధ్యతా లేదు. ఎవర్నీ దండించవలసిన పని లేదు. నువ్వు సుశీలవని నాకు తెలుసుగా!" అనేవాడు.

ఆమె మాట్లాడేందుకు అవకాశం వుండేది కాదు. ఇక యీ సందర్భంలో నన్నా భర్త కలిగించుకోకపోతే లాభం లేదు. ఎందుకంటే లిఖితపూర్వకంగా దాసు దొరికాడు, రుజూ చేసేందుకు తానేమీ కష్టపడనక్కర్లేదు.

అనుకున్న ప్రకారమే ఆమె మాట్లాడకుండా ఆ ఉత్తరాన్ని భర్తకు ఇచ్చింది. అతను ఆసాంతమూ చదివాడు కాని తను అనుకున్నంతగా అతను చలించలేదు.

"ఎవరూ? మన దాసేనంటావా?"

"మన దాసు! బాగానే వుంది. లేక నేనే రాసుకొని మీకు చూపాననుకున్నారా? యీ మొగాళ్ళ సంగతి నాకు బాగా తెలుసు. కాస్త అందగత్తె కనిపిస్తే వాళ్ళ తలకాయల్లోని మెదళ్ళు మాయమవుతయ్..." కాస్సేపు దుమ్మెత్తిపోసింది.

ఆ దుమారం ఆగాక ప్రకాశరావు శాంతంగా నవ్వి "ఏం చేద్దామంటావు?" అన్నాడు.

"పిలిపించి నాలుగు తన్ని పంపండి."

"పిలిస్తే వొస్తాడా? అనుమానపడతాడు. కనుక – నువ్వే ఒక ఉత్తరం రాయి....ఏ మధ్యాహ్నమో రమ్మని ఆహ్వానించు––"

యీ సలహా ఆమెక్కూడా రుచించింది. తన భర్త రక్షణ వుంటుంది కనుక తనకు మరే భయమూ ఉండదు!

❋ ❋ ❋

అనుకున్న ప్రకారం దాసుకు ఉత్తరం జేరింది. నిర్ణీత కాలానికి అతను వొస్తాడనే ఉద్దేశంతో ఆ దంపతులిద్దరూ వేచి కూర్చున్నారు... కాని ఆనాటికి అతను రాలేదు.

మర్నాడు సాయిత్రం భర్త యింటికి వొచ్చి సుశీలను పిలిచి చెప్పకుండానే ఫక్కున నవ్వసాగాడు. సంగతేమిటో తెలియక ఆమె నిశ్చేష్టురాలైంది. అతను నవ్వుతూన్నకొద్దీ ఆమె ఓర్పు క్షీణించసాగింది.

"నవ్వాపి చెప్పండి" అందామె ప్రాధేయపడుతూ.

ఎలాగో నవ్వాపుకుంటూ ప్రకాశరావు చెప్పసాగాడు.

"ఇవాళ ఏమైందో తెలుసా? పనిగట్టుకొని దాసు మా ఆఫీసుకు వొచ్చి నాతో రహస్యం మాట్లాడాలన్నాడు. నేను బైటపడకుండా సరేనన్నాను. నువ్వు రాసిన ఉత్తరం నా చేతికి ఇచ్చాడు!"

"ఆఁ" అందామె, ఆశ్చర్యంతో.

"దీన్నిబట్టి నీకు వొచ్చిన ఉత్తరం దాసు రాసింది మాత్రం కాదు, దాసు పేరుతో ఇంకెవరన్నా రాసి వుండాలి!"

అంతకన్న వేరొక విధంగా అనుకునేందుకు అవకాశమే లేదు.

"కనుక యీ సంగతులన్నీ అతనికి విప్పి చెప్పాను. పొరపాట్లు ఏ విధంగా జరిగినవో విశదపరిచాను. మన స్నేహాలకు భంగం కలిగించేందుకు ఎవరో నీచులు పన్నిన పన్నాగమని విడమర్చాను. రేపటినుంచీ అతను యధాప్రకారంగా మనింటికి వొస్తాడు. ఏమీ జరగనట్లే ప్రవర్తించటం మంచిది. నీకు కొన్ని పిచ్చి భ్రమలున్నవి. నిన్ను చూసిన మొగాడు మూర్ఛపోతాడనే అహం నీకెక్కువ. ఆ దృష్టితోనే చూడటంవల్ల నీకంతా అలాగే కనిపిస్తుంది. దృష్టిని కాస్త సరిజేసుకోవటం మంచిది" అన్నాడు ప్రకాశరావు.

ఒకపక్క డిసప్పాయింట్‌మెంటూ, రెండో వైపు భయం. కాస్త కఠినంగా మాట్లాడటంతో ఆమె ఎంతో బాధపడింది. ఎంతోమంది పురుషులు తన అందచందాలకు దాసులవటం తాను ఎరుగు. కాని వారంతా తన సౌందర్యానికి ఇచ్చిన విలువలన్నీ కూడా యీనాడు దాసు చూపిన తృణీకారంతో నశించినవి. మరి దాసు తనను ఎందుకు పొగిడేవాడు? కేవలం కళాదృష్టితోనేమో?

యీ సమాధానాన్ని ఎంత ప్రయత్నించినా ఆమె నమ్మ లేకుండా వుంది. ఒకవేళ నిజంగా తాను దాసును కోరినా కూడా, ఈ అభాస నిజమై తన కాపరం మట్టిపాలయేది. దాసులాంటి కఠినులు, నిర్లక్ష్యంతో సుందరాంగుల్ని లెక్కచెయ్యని పురుషులు కూడా వుంటారనే విషయం ఆమెకు మింగుడు పడకుండా వుంది.

ఈ దాసు తనకు గర్వభంగమయేట్లు చేశాడు. ఇతనొకణ్నీ లొంగ తీసుకోవటమంటే లోకంలోని పురుషులందరి పట్లా విజయాన్ని సాధించటం గానే ఆమెకు తోచింది. జరిగినదానికన్నా జరగవలసినదానికి ఆమె ఆలోచనలు ఎక్కువగా పనిచేయసాగినవి. ఈ దాసును వొదలకూడదు. ఎలాగైనా తన పాదాక్రాంతుణ్నిగా చేసుకోనిదే - తనూ ఒక అందగత్తె ననుకోవటం పొరపాటే అవుతుంది. సంవత్సరాల తరబడిగా ఎంతోమంది పురుషుల్ని మూర్ఖుల్నిగా నిరూపించగలిగిన తను యీ దాసుచేత మూర్ఖురాలుగా నిరూపించబడటంకన్న అవమానం మరోటి వుండదు.

మర్నాటినుంచీ దాసు వొస్తూనే వున్నాడు. అతన్ని చూసేందుకే ఆమె భయపడింది. కాని అతనే చొరవ చేసుకొని తమ మధ్య ఏమీ జరగనట్లే మామూలు ధోరణిని వ్యక్తపరిచాక కాని ఆమెకు తగినంత ధైర్యం కలగలేదు.

తిరిగి ప్రయత్నించయినా సరే ఈ దాసును జయించనిదే ఆమెకు మనశ్శాంతి కలిగేట్టు లేదు. తన సౌందర్యాన్ని మెచ్చుకునే దాసు ఆ సౌందర్యాన్ని అనుభవించేందుకు వెనుకాడడనే నమ్మకం ఆమెకు లేకపోలేదు. ఏదో ప్రమాదవశాత్తూ ఇంతవరకూ జరిగిన సంఘటనలు ఇలా విరుద్ధాభిప్రాయాలకు కారణమైనప్పటికీ సౌందర్యానికి దాసును దాసుణ్ని చేయటంలోనే తన చాకచక్యమూ, ప్రావీణ్యతా ఆధారపడి వుంటవి. ఈ సారి కూడా తాను అపజయం పొందితే తన సౌందర్యం ఎందుకూ కొరగానిదిగానే తేల్చుకోవాల్సి ఉంటుంది.

యీ నిశ్చయంతో ఆమెలో కొత్త ఉత్సాహం పని చేయసాగింది. దాసును ఆకర్షించేందుకూ లొంగదీసుకునేందుకూ ఆమె తన అభిరుచుల్లోనూ, సంస్కారంలోనూ కొన్ని మెట్లు కిందికి దిగనారంభించింది. దాసు పూర్వం వలె తన సౌందర్యాన్ని గూర్చి స్తోత్రపాఠాలు చెయ్యకపోవటం చూశాక ఆమె మరింత క్షోభకు గురికాసాగింది. క్షోభ, నిరుత్సాహపరిచేందుకు మారుగా ఆమెలోని పట్టుదలను రెట్టించింది.

ఇక ఆగలేక ఒకనాడు మెల్లిగా విషయాన్నీ, హృదయాన్నీ బైటపెట్టింది.

"నన్నెందుకిలా ఏడిపిస్తారు?" అంది సానుభూతిని కోరే చూపులతో, వేడికోలును వ్యక్తపరిచే కంఠస్వరంతో.

"నేనా? నేను మీకు కష్టం కలిగించానా? ఎప్పుడు? నాకు తెలియకుండానా? అలా ఐతే ఇక్కడికి రావటమే మానుకుంటాను" అన్నాడు దాసు అమాయికత్వాన్ని నటిస్తూ.

"స్త్రీ హృదయాన్ని తెలుసుకోలేనంత సంస్కారహీనులు కారు మీరు. నన్నింకా బాధించటం ధర్మంకాదు" అందామె.

"మీ ఆనందానికి ఏం చెయ్యమన్నా చేస్తాను--"

"ఇదివరకు నా సౌందర్యాన్ని ఎంత శ్లాఘించే వారు! ఇప్పుడు ఆ మాటే ఎత్తటంలేదు."

"ఓ! అదా! ఐతే మళ్ళీ పొగడటం మొదలుపెట్టమంటారా?"

"అనను. మాటల్లో మాత్రమే నన్ను స్తోత్రించి అవమానపరచనక్కర్లేదు" అందామె విసుగుతో.

"ఐతే...?" అని ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమె యీ సమయం కోసమే వేచి కూర్చోవటం వల్ల అతని ఒడిలో వాలింది. సరసుడూ, రసికుడూ, అనుభవజ్ఞుడూ ఐన దాసు యీ అవకాశాన్ని వృథా పోనియ్యలేదు...ఆమె అతన్ని జయించి తన సౌందర్యాన్ని రుజూ చేసుకున్నాననుకుంది. యీ గర్విష్ఠిని, జాణను, సౌందర్యరాశిని, స్వప్న సుందరిని జయించిన తృప్తి అతనికీ కలిగింది!

*– జులై, 1951*